

సీఎం ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లతో చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్

సీఎం ప్రజావాణి స్ఫూర్తిదాయకం

● మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు

బేగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి స్ఫూర్తిదాయకమని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు పేర్కొన్నారు. శుక్రవారం సీఎం ప్రజావాణిని మధ్యప్రదేశ్‌కు చెందిన 24 మంది డిప్యూటీ కలెక్టర్లు సందర్శించారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌తో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్‌లోనూ అమలు చేస్తామని డిప్యూటీ కలెక్టర్ల ప్రతినిధి ఆదిత్య నారాయణ తివారి తెలిపారు.



మాట్లాడుతున్న జస్టిస్ నాగేశ్ భీమపాక

వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా అవగాహన వాక్

బంజారాహిల్స్/నిమ్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని అపోలో షుగర్ క్లినిక్స్ ఆధ్వర్యంలో 'డయాబెటీస్‌ను నివారించేందుకు నడుద్దాం' అనే నినాదంతో శుక్రవారం వాక్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జస్టిస్ నాగేశ్ భీమపాక హాజరై రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న డయాబెటీస్ కేసులు తగ్గాలంటే ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు ముందస్తు స్ర్కీనింగ్, జీవనశైలిలో మార్పులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అపోలో షుగర్ లీడ్ కన్సల్టెంట్ డా.జె.జయప్రకాశ్‌సాయి మాట్లాడుతూ సకాలంలో జాగ్రత్తలు, సరైన చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రోటేరియన్లు, వైద్యులు, ఫిజియోథెరపిస్టులు, నర్సులు, న్యూట్రీషనిస్టులు, డయాబెటీస్ ఎడ్యుకేటర్లు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు. డయాబెటిస్ నివారణలో ఆధునిక సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు అన్నారు. వరల్డ్ డయాబెటీస్ దినోత్సవం సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఇన్సులిన్ పంపులు టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారుల జీవితాల్లో వెలుగును నింపుతున్నాయన్నారు. ఎండోక్రైనాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బియాట్రిస్ అని ఆధ్వర్యంలో ట్రామా భవనంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు సుమన, సుబ్బలక్ష్మి, సదాశివుడు, సిబ్బంది పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరిబాబు

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అమీర్‌పేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎస్ఆర్‌నగర్ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పాఠకులతో కలిసి లైబ్రేరియన్ హరిబాబు దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రీ-కాన్ఫరెన్స్ సింపోజియం

అమీర్‌పేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశీ ప్రత్యేక పెట్టుబడులు, తెలంగాణపై దృష్టి అనే అంశంపై తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ (టీఈఏ), సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రీ-కాన్ఫరెన్స్ సింపోజియంను నేడు నిర్వహిస్తున్నట్లు సెస్ డైరెక్టర్ రేవతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సెస్‌లోని బీపీఆర్ విఠల్ ఆడిటోరియంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డీబాసీస్ ఆచార్య వస్తారని ఆమె తెలిపారు.



తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టిమ్రిస్) చైర్మన్ ఫహీం ఖురేషితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ దంపతులు. చిత్రంలో ఖమ్మం కార్పొరేటర్ మహ్మద్ ముస్తఫా



శ్రీరామ్‌నగర్ కూడలిలో ఎంఐఎం జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అన్వర్ సాదత్‌కు మిఠాయి తినిపిస్తున్న కార్యకర్తలు





ఉప ఎన్నిక ఫలితాలను ఎల్ఈడీ ద్వారా తెలుసుకుంటున్న బస్తీ వాసులు



నవీన్ యాదవ్‌ను అభినందిస్తున్న రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

హిల్స్ నవీన్ యాదవ్‌దే

ఉప ఎన్నిక గెలుపుతో కాంగ్రెస్ సంబరాలు

యూసుఫ్‌గూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. పటాకులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

స్టూడియో వర్కర్లకు అభినందనలు

స్టూడియో వర్కర్స్ యూనియన్ సభ్యులందరికీ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరేశం, కోశాధికారి ఆర్.పెద్ద ఉపేందర్ అభినందనలు తెలిపారు. నవీన్ యాదవ్‌ను శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. సినీ కార్మికుల సమస్యల కోసం కృషి చేయాలని వారు కోరారు.



కేవీబీఆర్ స్టేడియం బయట పోలీసుల బందోబస్తు

రెండేళ్ల పాలనకు నిదర్శనం



అమీర్‌పేటలో మాట్లాడుతున్న డా.కోట నీలిమ

అమీర్‌పేట/బేగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల ప్రజాపాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితమే నిదర్శనమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డా.కోట నీలిమ అన్నారు. శుక్రవారం అమీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మిరియాల నవీన్‌రాజు, రవీందర్, రజనీకాంత్, గోదాస్ నవీన్ పాల్గొన్నారు. సనత్‌నగర్‌లో జరిగిన సంబరాల్లో డా.కోట నీలిమ, విశాల్ సుధాం పాల్గొన్నారు.



బేగంపేట బస్తీలో జరిగిన సంబరాల్లో బాణా సంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు సలీంఖాన్, హనీఫ్‌ఖాన్



మంత్రి దామోదర రాజనర్సింహను అభినందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, మొహ్మద్ మోసిన్ ఖురేషి తదితరులు



ఎర్రగడ్డలో స్వీట్లు పంచి పెడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ సర్దార్

బీఆర్ఎస్‌కు చెంపపెట్టు

ఎర్రగడ్డ/బోరబండ/వెంగళరావునగర్/ఖైరతాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక ఫలితం బీఆర్ఎస్ నాయకులకు చెంపపెట్టు లాంటిదని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. నవీన్ యాదవ్ గెలుపొందడంతో ఆయన ఎర్రగడ్డకు వచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనను సన్మానించారు.

తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణ కుమార్, రమేష్ నాయక్, భాస్కర్ పాల్గొన్నారు.



బంజారా నగర్‌లో సంబరాలు చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబునాయక్, నరేష్ నాయక్, నారాయణ తదితరులు



వెంగళరావునగర్ టి-జంక్షన్‌లో నిర్వహించిన సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, తదితరులు



ఖైరతాబాద్ భారీ గణపతి చౌరస్తాలో మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు మారయ్య యాదవ్, కిశోర్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు

నెహ్రూ బాటలో యువత నడవాలి



బాలల దినోత్సవంలో ఎమ్మెల్సీ వాణిదేవి

ఎర్రగడ్డ/బేగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చూపిన బాటలో నేటి యువత నడవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్‌టీ విభాగం కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. నెహ్రూ జయంతి, చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని ఎర్రగడ్డ బీ శంకర్‌లాల్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు ఆయన స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాము, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ ఆధ్వర్యంలో హేమవతి నగర్ చౌరస్తాలో నెహ్రూ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాము, హనుమంతు, మధుగౌడ్, సాల్మన్, కుమారి, రాజమణి, ఉమ పాల్గొన్నారు. బేగంపేటలోని స్వామి రామానంద స్మారక సంస్థలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ వాణిదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సురభి సోలార్ డైరెక్టర్ శేఖర్ మారంరాజు తదితరులు పాల్గొన్నారు.



బీ శంకర్‌లాల్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు రమేష్ నాయక్, రాము తదితరులు

మాదకద్రవ్యాల రహిత సమాజమే ధ్యేయం

● మంత్రి అజారుద్దీన్



శాంతికపోతం ఎగురవేస్తున్న మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. బాలల దినోత్సవంలో భాగంగా వేక్ ఆఫ్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంజీవయ్య పార్కులో నిర్వహించిన నషాముక్త్ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. టమ్రీస్ అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో సమాజంలోని ముఖ్య వ్యక్తులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫస్ట్ ఓవర్సీస్ సిటిజన్ ఇఫ్తికార్ షరీఫ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కదలికలు, వారి కార్యకలాపాలు, స్నేహితులపై కఠినమైన నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, నార్కోటిక్స్ డీఎస్పీ సయ్యద్, మాజీ ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి, యూత్ అంబాసిడర్ వేక్ ఆఫ్ హ్యూమానిటీ అసదుద్దీన్ అబ్బాస్, కాంగ్రెస్ నాయకులు షేక్ అక్బర్, వీఐపీ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ ముజ్తబా అమీర్, లీగల్ అడ్వైజర్ సయ్యద్ వాసె, ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ నూర్ బానీ, సయ్యద్ నూర్, అసదుద్దీన్ అబ్బాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సాయి సరస్వతిలో..

యూసుఫ్‌గూడ/బోరబండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణనగర్‌లోని శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ సేవాభావంతో పాటు పలు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శిరీషశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలో విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బోరబండ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



శ్రీ సాయి సరస్వతి పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శన



శ్రీగణేష్‌కు మిఠాయిలు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో తార్నాకలోని తన క్యాంపు కార్యాలయ ఆవరణలో విజయోత్సవ సంబరాలను జరుపుకుంటున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి

జూబ్లీహిల్స్ ఘన విజయంతో సంబరాలు

సికింద్రాబాద్, మారేడుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండేళ్లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి సైతం వేలాది కోట్ల రూపాయల నిధులు కేటాయించడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో హస్తం పార్టీకి అత్యధిక మెజారిటీ ప్రజలు అత్యధిక మెజారిటీతో హస్తం పార్టీని గెలిపించారని శ్రీగణేష్ తెలిపారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో శుక్రవారం పికెట్‌లోని శ్రీగణేష్ కార్యాలయం వద్ద హస్తం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ, ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించినందుకు సీఎం కంటోన్మెంట్ అభివృద్ధిని తన భుజస్కంధాలపై వేసుకున్నారని, దాని ఫలితమే వేలాది కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధికి, బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారానికి మధ్య జరిగిన ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు దాదాపు 25వేల ఓట్ల మెజారిటీ తీసుకొచ్చారని తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధి జరగలేదని అవాకులు పేలిన బీఆర్ఎస్ నాయకులకు తాను జీవోలతో సహా సాక్ష్యాలు చూపించి, రూ.6 వేల కోట్ల నిధులు తీసుకు వచ్చినట్టు చెప్పడంతో ఆ నాయకులు తోక ముడిచారని వ్యాఖ్యానించారు.



సనత్‌నగర్‌లో సంబరాల్లో పాల్గొన్న సనత్‌నగర్ ఇన్‌చార్జీ కోట నీలిమ, బేగంపేట సీనియర్ నాయకులు విశాల్ సుధాం



బేగంపేట బస్తీలో జరిగిన సంబరాల్లో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు సలీంఖాన్, హనిఫ్‌ఖాన్ తదితరులు

రేపు ఉచిత మెగా డయాబెటిక్ హెల్త్ క్యాంపు

తార్నాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తార్నాకలోని కందర్ డయాబెటిక్ సెంటర్‌లో శుక్రవారం ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.దిలీప్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధిచెందుతున్న భారత దేశంలో ప్రజలకు ఫిజికల్ యాక్టివిటీస్ తగ్గి మెంటల్ టెన్షన్ ఎక్కువ అవుతుందన్నారు. దాంతో చాలా మంది డయాబెటీస్ బారిన పడుతున్నారని తెలిపారు. బ్యాలెన్స్ న్యూట్రీషన్, రెగ్యులర్ ఫిజికల్ యాక్టివిటీ, ఒత్తిడిని తగ్గించుకోవడం, నిర్ణీత సమయంలో ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే డయాబెటీస్‌ను అదుపులో ఉంచుకోవచ్చని సూచించారు. ఈ నెల 16న తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో ఉచిత మెగా డయబెటిక్ హెల్త్, ఒబెసిటీ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ క్యాంపునకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉచిత క్యాంపులో జీఆర్‌బీఎస్, సింగిల్, హెచ్‌బీఏ1 సీ, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, బీపీ, ఐ టెస్ట్, యూరిక్ ఆసిడ్, ఒబెసిటీ స్క్రీనింగ్, డైట్ కన్సల్టేషన్ సేవలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

బాలల్లారా రారండోయ్..

ఘనంగా బాలల దినోత్సవం





సికింద్రాబాద్ పాఠశాలలో డాన్స్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలకలగూడ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ దూద్‌బావిలో చిలకలగూడ ఇంగ్లిష్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు జవహర్‌లాల్ నెహ్రూ, ప్రముఖ కవి అందెశ్రీ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరల్డ్ మిషన్ సంస్థ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసి, ఈ సందర్భంగా విద్యార్థుల తల్లితండ్రులను సత్కరించారు. వరల్డ్ విజన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్, ప్రభుత్వ స్కూలు హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినుల తల్లులను సత్కరిస్తున్న స్కూలు ఉపాధ్యాయులు

బోయినపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి బాపూజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. అనంతరం ఆయన పిల్లలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలకు హాజరైన తల్లిదండ్రులకు, ప్రధానోపాధ్యాయులను జంపన సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం ఉపాధ్యాయ బృందం పద్మావతి, సరితా, శోభారాణి, అర్తి మేడం, అనిత, హరినాథ రావుతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాపూజీ నగర్ ప్రభుత్వ పాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలలో జంపన ప్రతాప్

స్వామి రామానంద సంస్థలో..



బాలల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వాణీదేవి

బేగంపేట: బేగంపేటలోని స్వామి రామానంద స్మారక సంస్థలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వాణీదేవి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక , సృజనాత్మక కార్యక్రమాలలో విజేతలైన విద్యార్థులకు వాణిదేవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సురభి సోలార్ డైరెక్టర్ శేఖర్ మారంరాజు తదితరులు పాల్గొన్నారు.



తార్నాకలోని సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్‌లో ఆట పాటలతో సందడి చేస్తున్న పాఠశాల విద్యార్థినులు



'సీఎం ప్రజావాణి'ని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లతో ఇన్‌చార్జీ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్

సీఎం ప్రజావాణి స్ఫూర్తి దాయకం

మధ్యప్రదేశ్‌లోనూ అమలుచేస్తాం: ఆ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్లు

బేగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 24 మంది డిప్యూటీ కలెక్టర్లు సందర్శించారు. శుక్రవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి పని తీరును మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్లు పరిశీలించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తీసుకుంటున్న చర్యలు, ప్రజల కోసం అమలు చేస్తున్న పంథాను స్ఫూర్తిగా తీసుకొని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ ఇదే తరహా కార్యక్రమాన్ని అమలు చేస్తామని డిప్యూటీ కలెక్టర్స్ ప్రతినిధి ఆదిత్య నారాయణ తివారి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి ఇన్‌చార్జీ డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో వారు భేటీ అయ్యారు. అమలు తీరును, ప్రజా సమస్యల పరిష్కారంలో అమలు చేస్తున్న వైఖరిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చిన్నారెడ్డి, దివ్యలు డిప్యూటీ కలెక్టర్లకు వివరించారు. ఇక్కడ అమలు చేస్తున్న విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు.

మంత్రి అజారుద్దీన్‌కు ఆహ్వానం

తిరుమలగిరి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని హోలీ ఫ్యామిలీ చర్చ్ సభ్యులు శుక్రవారం రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్ తో పాటు జూబ్లీ ఇయర్ సెలబ్రేషన్స్ కు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయడిన్ రోచ్, అబ్రహం, హార్వడ్, నరేష్, అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

'హక్కులకు నోచుకోని సంచారజాతుల పిల్లలు'

పద్మారావునగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంచారజాతుల పిల్లలు ప్రాథమిక హక్కులకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని స్కై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.వై సంజీవకుమార్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంచార జాతుల పిల్లలకు పలకలు, ఆటవస్తువులు, ఆహారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంచార జాతుల పిల్లలకు విద్య, సమతుల ఆహారం అందించడంతో పాటు క్రీడలలో ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని పాల్గొన్నారు.





సికింద్రాబాద్‌లో తాడ్‌బండ్ వీరాంజనేయ దేవస్థానం, ముస్తాబైన ఆలయం

తాడ్‌బండ్ ఆలయం.. ముస్తాబు

రేపట్నుంచి ఆలయంలో మహా అన్నకోట మహోత్సవం



వీరాంజనేయ స్వామి

బోయినపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన సికింద్రాబాద్ తాడ్‌బండ్ దేవస్థానంలో ఆదివారం ఉదయం 56వ భోగ మహా అన్నకూట మహోత్సవంను వేదపండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మధ్యాహ్నం ఒంటి గంటకు దివ్యజ్యోతి దర్శనం ఉంటుందని ఆలయాల ఈఓ నరేందర్ తెలిపారు. వేలాది మంది ఆవు, జంతు ప్రేమికులు రోజంతా వేడుకలో పాల్గొననున్నారు. అన్నకూట్ పండుగను కొత్త ఆరంభంగా జరుపుకుంటారు. అన్నకూట్ సాహిత్యపరమైన అహార పర్వతం.. ఇది దేవునికి అహార నైవేద్యాన్ని, దానిని తయారు చేయడంలో ఉన్న ప్రేమ, భక్తిని సూచిస్తుంది. ఎంతో ప్రేమతో, భక్తితో తయారు చేసిన అనేక రకాల అహార పదార్థాలను భగవంతుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సమర్పిస్తారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

ట్రావెల్ ఏజెంట్లు, యజమానులు నిబంధనలు పాటించాల్సిందే ● నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్



ట్రావెల్ యజమానులు ఏజెంట్లతో సమావేశమైన నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్

అడ్డగుట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన ఘటనలో భాగంగా సికింద్రాబాద్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. శుక్రవారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో సికింద్రాబాద్ ఏరియాలో ఉన్న ట్రావెల్ యజమానులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టూరిజంవచ్చే యాత్రికులైనా మరెవరైనా అద్దె కార్లలో ప్రయాణం చేయాల్సి వస్తే యాత్రికుల నుంచి ఐడీ కార్డులు తీసుకుని పూర్తి వివరాలు సేకరించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అన్ని ట్రావెల్ టూర్ సంస్థలు భద్రతా నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయాణికుల ధ్రువీకరణ ముఖ్యంగా ఔట్ స్టేషన్ అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి పూర్తి వివరాలు సేకరించి ఎక్కడ ఎక్కుతున్నారు.. ఎక్కడ దిగుతున్నారు..? ఎందుకోసం వస్తున్నారనే కారణాలపై ఐడీ కార్డులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనధికార ఏజెంట్లను నియమించకుండా చూడాల న్నారు. ఆన్‌లైన్ టికెట్ మోసాలను నివారించడానికి కస్టమర్లలో అవగాహన కల్పించాలని, అనుమానిత వ్యక్తులపై ఆయా పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ట్రావెల్ ఏజెంట్లపై ఉందన్నారు. ఈ సమావేశంలో ట్రావెల్ ఏజెంట్లు, యజమానులు బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో శిక్షణ ప్రారంభం



బోయినపల్లి బాపూజీ నగర్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శిక్షణను ప్రారంభిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు

బోయినపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సామర్థ్య భవన ప్రత్యేక శిక్షణా శిబిరాలు శుక్రవారం బోయినపల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటాజి పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ వి.సర్వేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చందనా సర్వే, అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరంలో రాష్ట్రానికి చెందిన 22 జిల్లాలకు చెందిన 650 మంది ఉపాధ్యాయులు అంశాల వారీగా పాల్గొంటున్నారు. శిక్షణ శిబిరంలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, వ్యాయామ విద్యతో పాటు పలు అంశాల పైన డీఆర్‌పీ (డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్) ఎంఆర్‌పీఎస్ (మండల్ రిసోర్స్ పర్సన్స్) ఇరవై రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సామర్థ్య భవన శిక్షణా శిబిరం అనేది గిరిజన పాఠశాలలో పనిచేసే సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడానికి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఉద్దేశించిన శిక్షణా కార్యక్రమమని తెలిపారు. ఈ శిబిరంలో పాఠశాలల్లో పరిశుభ్రత, పోషకాహారం, ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించవచ్చని తెలిపారు. శిక్షణ ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించవచ్చని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లాలూనాయక్, హెచ్ఎం అముక్త మాల్యద, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి, టీడబ్ల్యూ వాటర్ స్పోర్ట్స్ అకాడమీ హెచ్‌డబ్ల్యూఓ నీలిమ పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బౌద్ధనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి శుక్రవారం.. బౌద్ధనగర్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యే క పూజలను నిర్వహించారు. వివిధ రకాల పూలు, నిమ్మకాయల దండలతో కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. ఆలయచైర్మన్ కె.ధరణీధర్, ప్రధానార్చకులు శ్రీనివాస పంతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బౌద్ధనగర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): వివిధ కేబుల్‌లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యానగర్ ఏఈ రోచిత తెలిపారు. ఎల్ఎన్ నగర్ ఫీడర్ పరిధిలో ఎల్.నారాయణనగర్, వారాసిగూడ, న్యూఅశోక్‌నగర్ నాలా, అంబర్‌నగర్, పార్శీగుట్ట వైఎస్సార్ పార్కు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ తెలిపారు.



పూజా కార్యక్రమంలో మారేడుపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నెహ్రూనగర్ పార్కులో కార్తీక దీపోత్సవం

మారేడుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మారేడు పల్లి నెహ్రూనగర్ పార్కులో శుక్రవారం మారేడుపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ మహోత్సం పూజా కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వారు కుటుంబ సమేతంగా విచ్చేసి దీపాంతలు వెలిగించి శివ పార్వతి అమ్మవారిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో నెహ్రూ నగర్ పార్క్ భక్తులతో కిటకిటలాడింది. పూజ కార్యక్రమంలో సీనియర్ సిటజన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సి.కె నర్సింగ్ రావు, జాయింట్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫౌండర్ మెంబర్ జి. మహాత్మారావు, పి. వీరారెడ్డి, పి. నర్సింగ్ రావు, సీనియర్ సిటిజన్ మహిళలు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు పవన్ అద్దాల, కృష్ణగోపాల్ భండారి, సంతోష్ నారాయణ్‌కర్, అజయ్ శేషరావు షిండే

ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాలకు రక్షణ : డా.పవన్

రెజిమెంటల్‌బజార్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : యువతలో ప్యాంక్రియాస్ సంబంధిత క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా.పవన్ అద్దాల అన్నారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అవగాహన నెలను పురస్కరించుకుని శుక్రవారం సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం భారత్ దేశంలో సుమారు 15,000 ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులు నమోదువుతున్నాయని తెలిపారు. ఈ క్యాన్సర్‌లో ప్రారంభ దశలో ఏ లక్షణాలు కనిపించవని, గుర్తించే సమయానికి వ్యాధి తీవ్రత పెరిగిపోయి ఉంటుందని తెలిపారు. ఆధునిక జీవనశైలి, ఎక్కువ సేపు కూర్చునే పని, ఊబకాయం, ధూమపానం, మద్యపానం ప్రధాన కారణం అన్నారు. డయాబెటిస్, ఊబకాయం, ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవారు తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ పై అవగాహన కల్పించడానికి వాక్‌థాన్, ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు, యువ వైద్యుల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణగోపాల్ భండారి, డా.సంతోష్ నారాయణ్‌కర్,డా.అజయ్ శేషరావు షిండే తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సింగ్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేట్ నెంబరు 5 వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల ప్రయాణికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింగ్ (ఫైల్)

మారేడుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మానసిక ఆందోళనతో బాధపడుతూ ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాని సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లికి చెందిన ఎం.నర్సింగ్ (47) గతంలో అడపాదడపా ఇంట్లో నుంచి వెళ్లి రెండు మూడు రోజులకు ఒకసారి తిరిగి వచ్చేవాడు. కానీ ఈ సారి ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలిస్తే మారేడుపల్లి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

'ఎక్స్‌కలేటర్ లిఫ్టు బాగుచేయండి'



సికింద్రాబాద్‌లోని ఎక్స్‌కలేటర్‌ను పరిశీలిస్తున్న డీవైఎఫ్ నాయకులు

అడ్డగుట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సెయింట్ స్కూలు వద్ద ఉన్న ఎక్స్‌కలేటర్‌కు వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ జావీద్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి' లో ఈనెల 7వ తేదీ న ప్రచురితమైన "విద్యార్థు లు రోడ్డు దాటేదేలా" కథనానికి డీవైఎఫ్ఐ స్పందించి శుక్రవారం ఎక్స్‌కలేటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్ స్కూలు వద్ద ఉన్న ఎక్స్‌కలేటర్ కొన్ని సంవత్సరాలనుంచి పాడైపోతే ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. ప్రతి రోజు బడికి వెళుతున్న చిన్నారులు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. స్కూలు బ్యాగు వేసుకుని పాడైపోయిన ఎక్స్‌లేటర్ ఎక్కాలంటే భయానికి గురవుతున్నారని వారు ఆవేదనవ్యక్తం చేశారు. గత ఇరవై ఏళ్ల క్రితం ప్రజా సంఘాల పోరాటం ఫలితంగా అప్పుడు ఈ నిర్మాణం జరిగిందని వారు గుర్తు చేశారు. వెంటనే ఎక్స్‌కలేటర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. రెండు రోజుల్లో జీహెచ్ఎంసీ అధికారులను కలిసి వినతి పత్రం సమర్పిస్తామని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ జావీద్ తెలిపారు.